క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తొండంగి: గోపాలపట్నంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో జగ్గంపేట ఈఈ రత్నాలరావు సోమవారం తెలిపారు. అన్నవరం గోపాలపట్నం, బెండపూడి తదితర గ్రామాలకు ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

చిట్టిబాబు సేవలు మరువలేనివి



చిట్టిబాబు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ పర్వత రాజుబాబు తదితరులు

శంఖవరం: ప్రత్తిపాడు నియోజకవర్గానికి దివంగత మాజీ ఎమ్మెల్యే పర్వత చిట్టిబాబు చేసిన సేవలు మరువలేనివని ఎంపీపీ పర్వత రాజుబాబు అన్నారు. శంఖవరంలో సోమవారం చిట్టిబాబు వర్ధంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యేగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పడాల దొంగబాబు, బొమ్మిడి లిల్లియ్య, రేలంగి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ యూత్ ప్రెసిడెంట్‌గా జగదీశ్

రౌతులపూడి: సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ మండల యూత్ ప్రెసిడెంట్‌గా రౌతులపూడికి చెందిన యామల జగదీశ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వుల్లిపాయల శంకరయ్య నుంచి నియామక పత్రం అందినట్లు సోమవారం జగదీశ్ తెలిపారు. తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శంకరయ్యకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బీసీల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు.

రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం



డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న తాండవ షుగర్స్ మాజీ చైర్మన్ దొరబాబు

తుని రూరల్: జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో చేస్తున్న రీ సర్వేతో గ్రామాల్లోని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తాండవ షుగర్స్ మాజీ చైర్మన్ నాగం దొరబాబు అన్నారు. మండలంలోని చామవరంలో మండల సర్వేయర్ దేవుడు ఆధ్వర్యంలో సోమవారం డ్రోన్‌తో చేపట్టిన సమగ్ర సర్వేను దొరబాబు ప్రారంభించారు. భూముల రీ సర్వేను ప్రభుత్వం పారదర్శకంగా చేస్తోందన్నారు. ఈ సర్వేతో హద్దులు, రికార్డులు పక్కాగా ఉంటాయన్నారు. సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి టీవీవీ సత్యనారాయణ, విలేజ్ సర్వేయర్, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భూములు ఇప్పించాలని వినతి



ప్రత్తిపాడు తహసీల్దార్ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

ప్రత్తిపాడు: మండలంలోని బవ్వురువాకలో అన్యాక్రాంతమైన తమ భూములు ఇప్పించాలంటూ ఆ గ్రామ గిరిజనులు సోమవారం ప్రత్తిపాడు తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణకు వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని వివిధ సర్వే నంబర్లలోని 21.12 ఎకరాల భూమిని గత నాలుగు దశాబ్దాలుగా సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నామని గిరిజనులు పప్పుల రమణమ్మ, మొల్లు అప్పయ్యమ్మ, జలుమూరి అన్నవరం, నందా అమ్మాజీ తదితరులు తెలిపారు. తమ భూములను లీజు పేరిట తీసుకుని అన్యాక్రాంతం చేసేశారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించి, తమకు న్యాయం చేయాలని గిరిజనులు కోరారు.

అన్నా క్యాంటీన్ ప్రారంభం

జగ్గంపేట: స్థానిక మెయిన్‌రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద అన్నా క్యాంటీన్‌ను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ, ఆ పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ సోమవారం ప్రారంభించారు. ప్రతి సోమవారం జరిగే జగ్గంపేట సంతకు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో పేదలు వస్తారని, వారి సౌకర్యార్థం అన్నా క్యాంటీనును ఏర్పాటు చేసినట్టు జ్యోతుల నెహ్రూ తెలిపారు. పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

సమృద్ధిగా నీరు.. ఆశాజనకంగా పైరు

- పంపా ఆయకట్టు పరిధిలో రబీకి పూర్తిస్థాయిలో సాగునీరు
- ఎనిమిది వేల ఎకరాల్లో సాగు
- దిగుబడిపై రైతులు ఆశలు



పంపా ఆయకట్టులో ఆశాజనకంగా ఉన్న వరి పంట

అన్నవరం: పంపా రిజర్వాయర్ కింద తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో పది వేల ఎకరాల ఆయకట్టుకు రబీ పంటలకు నిరాటంకంగా సాగునీటి సరఫరా కొనసాగుతోంది. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా కోరిక మేరకు వరుసగా మూడో ఏడాది పంపా ఆయకట్టు కింద రబీ సాగుకు ప్రభుత్వం అనుమతించిన విషయం విదితమే. ప్రభుత్వం అధికారికంగా ఎనిమిది వేల ఎకరాల్లో రబీ సాగుకు అనుమతి ఇవ్వగా మరో రెండు వేల ఎకరాల్లో రైతులు అనధికారికంగా సాగు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏలేరు రిజర్వాయర్ నుంచి పంపా రిజర్వాయర్‌కు రోజుకు 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా రిజర్వాయర్ నుంచి ఆయకట్టుకు వంద క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది.

ఈనిక దశలో వరిచేలు

పంపా రిజర్వాయర్ నుంచి ఆయకట్టుకు గతేడాది డిసెంబర్ 26న రబీ సాగుకు నీరు విడుదల చేశారు. దీంతో రైతులు వరినాటు పూర్తి చేశారు. ప్రస్తుతం ఆయకట్టు పరిధిలో వరి పంట ఆశాజనకంగా ఉంది. కొన్ని చోట్ల పిలకల వేసే దశలోనూ, మరికొన్ని చోట్ల ఈనిక దశలో వరిచేలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. తొండంగి మండలంలోని కోదాడ గ్రామంలో ఐదు వందల ఎకరాలకు పిఠాపురం బ్రాంచి కెనాల్ (పీబీసీ) నుంచి నీటి సరఫరా చేయాల్సి ఉంది. పీబీసీలో నీటి లభ్యత లేని కారణంగా పొలాలు ఎండిపోతుండంతో పంపా నుంచి ఆ గ్రామంలోని పొలాలకు కూడా నీరు సరఫరా చేస్తున్నారు.

పంపాలో 99.5 అడుగల నీటి మట్టం

పంపా రిజర్వాయర్‌లో గరిష్ఠ నీటిమట్టం 103 అడుగులు కాగా ప్రస్తుతం 99.5 అడుగుల నీటి మట్టం ఉన్నట్టు అధికారులు తెలిపారు. 309 ఎంసీఎఫ్‌టీ నీటి నిల్వలు ఉన్నాయన్నారు. రబీ నీటి విడుదల ముగిశాక వేసవి అవసరాల కోసం చెరువుల్లో నీరు నింపుకునేందుకు గాను బ్యారేజీ గేటు ఎత్తి నీరు విడుదల చేయనున్నట్లు వివరించారు.



పంపా కాలువ ద్వారా ఆయకట్టుకు వెళుతున్న నీరు



నీటితో కళకళలాడుతున్న పంపా రిజర్వాయర్

రైతుల హర్షం

పంపా ఆయకట్టుకు ఎటువంటి నీటి ఎద్దడి లేకుండా రబీకి పూర్తి స్థాయిలో నీరు అందించడంపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో నీటి సరఫరాను పంపా ప్రాజెక్ట్ ఇరిగేషన్ అసిస్టెంట్ కె.శ్రీదేవి పర్యవేక్షిస్తున్నారు.

ఏప్రిల్ 15 నుంచి నీటి విడుదల నిలిపివేత



పంపా ఆయకట్టు పరిధిలో రబీ సాగుకు ఏప్రిల్ 15 నుంచి నీటి విడుదల నిలిపివేస్తాం. ప్రభుత్వం అధికారికంగా అనుమతి ఇచ్చిన ఎనిమిది వేల ఎకరాలతో పాటు పెదబాపన్నదొర చెరువు, కాగితాలమ్మ చెరువు, పీఈ చిన్నాయపాలెం చెరువుల కింద మరో రెండు వేల ఎకరాల్లో రైతులు అనధికారికంగా వరి సాగు చేశారు. ఏలేరు నుంచి రోజుకు 50 క్యూసెక్కుల నీరు పంపాకు వస్తోంది. ఆయకట్టుకు వంద నుంచి 115 క్యూసెక్కుల వరకూ నీటిని విడుదల చేస్తున్నాం.

– శేషగిరిరావు, ఇరిగేషన్ డీఈ, పిఠాపురం

ఎమ్మెల్యే చంటిబాబుకు కృతజ్ఞతలు



ఎమ్మెల్యే చంటిబాబుకు శాలువా కప్పి కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు

గోకవరం: గ్రామానికి చెందిన తూర్పుకాపు, వెలమ సంఘం నాయకులు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబుకు ఆదివారం కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక సంతమార్కెట్‌లో గత కొంత కాలంగా నిరుపయోగంగా ఉన్న భవనాన్ని తూర్పుకాపు, వెలమ సంఘాలకు ఎమ్మెల్యే కమ్యూనిటీ హాలుగా కేటాయించారు. దీనిపై ఆయా సంఘాల నాయకులు సోమవారం ఇర్రిపాకలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆయనను కలిశారు. ఎమ్మెల్యేకు పుష్ప గుచ్ఛాలు అందించి శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు. అవసరమైతే భవనం అభివృద్ధికి నిధులు సైతం మంజూరు చేస్తామని ఎమ్మెల్యే ఆయా సంఘాల సభ్యులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గోకవరం మండల సచివాలయ కన్వీనర్ దాసరి రమేష్, ఆయా సంఘాల నాయకులు తుమ్మల చిన్నబ్బు, యాళ్ల శేషు, చింతల అనిల్‌కుమార్, తుమ్మల శివాజీ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు

- ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్
- ప్రత్తిపాడు మండల సర్వసభ్య సమావేశం



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కాంతి సుధాకర్

ప్రత్తిపాడు: ప్రస్తుత వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. జగ్గంపేట వ్యవసాయ సహాయ సంచాలకుడు యింటి వీర గంగాధర్ మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. ఈ–క్రాప్ నమోదు కాకుంటే ధాన్యం కొనుగోలుకు ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. రైతులు ట్రాక్టర్లు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సబ్సిడీ మంజూరు చేస్తోందన్నారు. పోలవరం కాలువ సూపర్ ఫాసేజ్ వద్ద తరచూ గండ్లు పడుతున్నాయని, ప్రస్తుత వేసవిలో గండ్లు పూడ్చివేత పనులు పూర్తి చేయాలని ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు కోరారు. తాగునీరు అందక సుమారు 1500 ఎకరాల ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఏలేరు ఎడమ కాలువ నీటిని పైపుల ద్వారా వినియోగించుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఉత్తరకంచి ఎంపీటీసీ ఉమ్మిడి తాతీలు కోరారు. వైఎస్సార్ జలకళ పథకం ద్వారా వ్యవసాయ బోర్లు మంజూరు చేయాలని చినశంకర్లపూడి ఎంపీటీసీ పిల్లా కొండలరావు (చిన్న) కోరారు. జల జీవన్ మిషన్ పథకంలో మంజూరైన రూ.5.30 కోట్లతో మండలంలోని ఏలూరు, ధర్మవరం, పి.జగన్నాథపురం, ఉత్తరకంచి, గోకవరం, ప్రత్తిపాడు, రాచపల్లి, టి.రాయవరం, తొటపల్లి గ్రామాల్లో వాటర్ ట్యాంకుల నిర్మాణాలు చేపట్టనున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కేవీ శ్రీరామ్ తెలిపారు. గ్రామాల్లోని పశువులకు ఈ నెల 31 వరకూ గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేస్తారని మండల పశువైద్యాధికారి సుంకర వరలక్ష్మి తెలిపారు. జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, మండల కోఆప్షన్ సభ్యుడు గంటా మహలక్ష్మీరావు, ఎంపీడీఓ ఎస్.వెంకటాచలం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నెలాఖరుకు పన్ను బకాయిలు చెల్లించాలి



తునిలో పన్నుల బకాయిదారులకు అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ అధికారులు

తుని: పురపాలక సంఘం పరిధిలో యజమానుల ఆస్తి, ఖాళీ స్థలాలు, కుళాయి పన్నులను సకాలంలో చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు సూచించారు. ఆర్థిక సంవత్సరం ఈ నెల 31తో ముగియనున్న నేపథ్యంలో పన్నుల వసూళ్లకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం రెవెన్యూ అధికారి బి.సాల్మన్‌రాజు, ఇన్‌స్పెక్టర్లు శివాజీ, వల్లి, సచివాలయ అడ్మిన్లు దుర్గాప్రసాద్, డీఎస్ఎన్ రెడ్డి పన్ను బకాయిలు ఉన్న ఇళ్లకు వెళ్లి ఈ నెల 25 లోగా పన్నులు చెల్లించాలని సూచించారు. ఒక వేళ ఇబ్బందులు ఉంటే ఈ నెల 31లోగా ఇన్‌స్టాల్ మెంట్ చెల్లించాలని కోరారు. పట్టణ పరిధిలో ఇంటి పన్నుకు సంబంధించి డిమాండ్ రూ.5,00,87,795లకు గాను రూ.2,97,65,000 చెల్లించారని, ఇంకా రూ.2,03,22,795 బకాయి ఉందన్నారు. ఖాళీ స్థలాలకు సంబంధించి డిమాండ్ రూ.1,29,23,386లకు గాను రూ.36,17,316 చెల్లించారని, ఇంకా రూ.93,06,079 బకాయి ఉందన్నారు. కుళాయి పన్నుకు సంబంధించి డిమాండ్ రూ.1,79,95,072లకు గాను రూ.60,21,200 వసూలు కాగా రూ.1,19,73,872 బకాయి ఉందని వివరించారు. సంబంధిత యాజమానులు స్పందించి సకాలంలో పన్ను బకాయిలు చెల్లించాలని, లేకుంటే చట్ట పరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

పేదలందరికీ ఉపాధి పనులు కల్పించాలి



తునిలో ర్యాలీ చేస్తున్న లిబరేషన్ శ్రేణులు

తుని: గ్రామాల్లోని పేద ప్రజలందరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలని సీపీఎం (ఎంఎల్) లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు బుగత బంగార్రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం (అయార్ల), ఆల్ ఇండియా సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (ఏఐసీసీటీయూ) సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక గొల్లప్పారావు సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బంగార్రాజు మాట్లడతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిధులను దారి మళ్లిస్తోందన్నారు. గ్రామాల్లో పనులు లేక వ్యవసాయ కూలీలు వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధిహామీ పథకంలో అర్హత ఉన్నవారికి కూడా జాబ్ కార్డులు ఇవ్వడం లేదన్నారు. ఉపాధి కూలీలకు రోజువారి కూలి రూ.600 ఇవ్వాలని, సంవత్సరంలో 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 23న భగత్‌సింగ్ వర్ధంతి నుంచి వచ్చే నెల 14 అంబేడ్కర్ జయంతి వరకూ ఉపాధి పనుల్లో జరుగుతున్న అన్యాయాలపై పేదలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఏప్రిల్ 17న నిర్వహించే చలో అమరావతిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.జనార్దన్, ఆర్.సింహాచలం, మానుకొండ లచ్చబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే అసత్య ఆరోపణలు

- మండల ఉపాధ్యక్షుడు కుంచే రాజా
- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూకు చురకలు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మండల ఉపాధ్యక్షుడు రాజా, నాయకులు

గండేపల్లి: టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ తనపై చేసిన వ్యాఖ్యలు రాజకీయ లబ్ధి కోసమేనని వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు కుంచే రాజా పేర్కొన్నారు. గండేపల్లి ఎంపీపీ కార్యాలయంలో తన అనుచరులతో సోమవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. సూరంపాలెంలో ఆదివారం జ్యోతుల నెహ్రూ తన అనుచరులతో కలిసి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. రాజకీయంగా లబ్ధి పొందడం కోసం అసత్య ఆరోపణలు చేయడం తగదని హితవు పలికారు. బ్రిటిష్ కాలం (1938) నుంచి తమ కుటుంబం రాజకీయాల్లో ఉందన్నారు. ×నెహ్రూ రాజకీయాల్లోకి రాక ముందే మా తాత, పెదనాన్న, చిన్నాన్న, నేను (రాజా) గ్రామ సర్పంచులుగా పని చేసి ఈ ప్రాంత ప్రజలకు సేవలందించడం వాస్తవం కాదా ? అని ప్రశ్నించారు. గతంలో కొంత మంది పెద్దల సూచనల మేరకు కొన్నిసారు తాము పోటీ నుంచి తప్పుకోవడం వల్ల నెహ్రూ రాజకీయంగా పరపతి పొందారన్నారు. తమ కుటుంబం వల్ల ప్రయోజనం పొందిన నెహ్రూ తమపై అసత్య ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వాస్తవాలు మరిచిన నేతలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు చేయడం ఆయన హుందాతనానికి తగదన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నాయకులపై లేనిపోని ఆరోపణలు చేయడం నెహ్రూకు పరిపాటిగా మారిందన్నారు. రాజకీయాల కోసం నెహ్రూ ఇతరులపై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కందుల చిట్టిబాబు, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు ఒబిణ్ణి వీరబాబు, గండేపల్లి సొసైటీ మాజీ అధ్యక్షుడు పరిమి బాబు, ఎంపీటీసీ మద్దిపట్ల రామకృష్ణ, నీలాద్రిరావు పేట సర్పంచ్ ములంపాక సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో తనిఖీలు



పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న విద్యాశాఖ సీఎంఓ నాగేశ్వరరావు

తొండంగి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను విద్యాశాఖ సీఎంఓ ,అకడమిక్ కో ఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు సోమవారం తనిఖీ చేశారు. పంపాదిపేటలోని భవిత కేంద్రం, వాకదారిపేట కేజీబీవీ కేంద్రాలను పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చిన పుస్తకాలు, యూనిఫాం, షూ, తదితర వాటిపై ఆరా తీశారు. కేజీబీవీలో విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం, భోజనం పెట్టాలని అధికారులకు సూచించారు. తొండంగిలోని మెయిన్ సెంటర్ ప్రాథమిక పాఠశాలలో రికార్డులను పరిశీలించారు.ఉపాధ్యాయులకు పలు సూచనలు చేసారు. కార్యక్రమంలో ఎంఈవో షేక్ బాబ్జీ, సీఆర్పీలు ప్రతాప్‌రెడ్డి, కృపాషీలా తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా లేని వాహనాలపై కేసులు

రౌతులపూడి: రికార్డులు సక్రమంగా లేని తొమ్మిది వాహనాలపై కేసులు నమోదు చేసినట్టు కత్తిపూడి అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రమైన రౌతులపూడిలో సోమవారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. రికార్డులు సక్రమంగా లేని తొమ్మిది వాహనాలపై కేసులు నమోదు చేశారు. వీటిలో రోడ్డు ట్యాక్స్ చెల్లించని మూడు వాహనాలను సీజ్ చేసి రూ.60 వేలు జరిమానా విధించారు. వాహనదారులు ఎటువంటి జరిమానాలు పడకుండా నిర్ణీత సమయంలో ట్యాక్స్ చెల్లించాలని, ప్రతి వాహనానికి తప్పనిసరిగా ఇన్సూరెన్స్ కట్టాలని సూచించారు.

ఏలేరులో నిలకడగా నీటి నిల్వలు



ఏలేరులో ప్రస్తుత నీటి నిల్వలు

ఏలేశ్వరం: ఏలేరు జలాశయంలో నీటినిల్వలు నిలకడగా ఉన్నాయి. రిజర్వాయర్ సాధారణ నీటిమట్టం 86.56 మీటర్లు కాగా, సోమవారం 79.89 మీటర్లుగా నమోదైంది. జలాశయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 24.11 టీఎంసీలకు గాను 12.97 టీఎంసీలు ఉన్నాయి. ఆయకట్టుకు 600, స్పిల్ వే ద్వారా 400, విశాఖకు 225, తిమ్మరాజు చెరువుకు 60 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

కవితా కుసుమాలకు సత్కారం



జ్ఞాపికలతో విద్యార్థులు, ఉపాధ్యాయుడు విజయరత్నం

కిర్లంపూడి: తామరాడ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కవి తిరగటి విజయరత్నం, అతని శిష్యులను శ్రీశ్రీ కళావేదిక సభ్యులు ఘనంగా సత్కరించారు. అమలాపురం సీవీ రామన్ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో కోనసీమ ఉగాది జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విజయరత్నం దంపతులతో పాటు పాఠశాలకు చెందిన మరో ఎనిమిది మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరు ఆంధ్రప్రదేశ్ వెంకటగిరి వైభవం, ఓటు–నోటు, భ్రూణ హత్యలు, చరవాణి, అమ్మ స్నేహం ఇదేరా, మా పాఠశాల అంటే మాకిష్టం, దేశ రక్షణ–సైనికులు, స్నేహం కోసం, వృద్ధాశ్రమాలు, అమ్మగొప్పదనం తదితర పలు సామాజిక అంశాలపై కవితలు వినిపించి ఆకట్టుకున్నారు. దీంతో పూలమాల, శాలువా, జ్ఞాపికలతో నిర్వాహకులు వారిని సన్మానించారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



తూర్పులక్ష్మీపురంలో పశువులకు టీకాలు వేస్తున్న జంతుసంరక్షణ అధికారి ఝాన్సీరాణి

ఏలేశ్వరం: మండలంలోని తూర్పులక్ష్మీపురంలో పశువులకు సోమవారం గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వ్యాక్సినేషన్ శిబిరాన్ని ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి శివప్రసాద్ ప్రారంభించారు. సచివాలయ జంతుసంరక్షణ అధికారి ఝాన్సీరాణి ఆధ్వర్యంలో సుమారు 100 పశువులకు టీకాలు వేశారు. రైతులు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో విలేజ్ అసిస్టెంట్ రాజు, రైతులు శిడగం శ్రీనివాస్, మజ్జి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాకపల్లిలో..

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని వాకపల్లిలో పశువులకు సోమవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. తొలుత పశువులకు వ్యాక్సినేషన్ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ రొంగల నాగేశ్వరరావు ప్రారంభించారు. పశువైద్య సిబ్బంది రైతులు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు.

చెత్త నుంచి సంపద కేంద్రాలకు రక్షణ



పాతకొట్టాం సంపద కేంద్రం వద్ద పాదు మొక్కను నాటుతున్న ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్, సర్పంచ్ వరహాలు

కోటనందూరు: గ్రామాల్లోని చెత్త నుంచి సంపద కేంద్రాలకు రక్షణగా ఎగబాకే (క్రీపర్స్) పాదులను పెంచుతున్నట్లు పంచాయతీ విస్తరణాధికారి జి.అరుణ్‌కుమార్ తెలిపారు. పాతకొట్టాం సంపద తయారీ కేంద్రం వద్ద ఎగబాకే పాదు మొక్కలను సోమవారం సర్పంచ్ పసగడుగుల వరహాలుతో కలిసి ఆయన నాటారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ సంపద కేంద్రాల్లో వర్మీ కంపోస్టు తయారీలో భాగంగా పెంచుతున్న వానపాములు వేసవి తాపానికి చనిపోకుండా చల్లదనాన్నిచ్చే పాదులను కేంద్రాల వద్ద పెంచుతున్నామన్నారు. ఇప్పటికే మంచి ఫలితాలిస్తున్న సంపద కేంద్రాలను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. అనంతరం గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఫీవర్, ఆయుష్మాన్‌భారత్ సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి కుశిరెడ్డి అప్పలరాజు పాల్గొన్నారు.

సచివాలయాల్లో ఈ–క్రాప్ బుకింగ్ జాబితాల ప్రదర్శన



ఈ–క్రాప్ బుకింగ్ జాబితాలను ప్రదర్శించిన అధికారులు

తుని రూరల్: రైతులు రబీలో సాగు చేసిన పంటలకు ఈ–క్రాప్ నమోదు చేసి ఆయా రైతుల పేర్లతో కూడిన జాబితాలను గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించినట్టు వ్యవసాయ సహాయ సంచాలకులు సుంకర బుల్లిబాబు సోమవారం తెలిపారు. తుని వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ సాగు చేస్తున్న భూములు, రైతుల వివరాలు జాబితాల్లో పొందుపర్చామన్నారు. ఐదు మండలాల్లో 23 వేల ఎకరాల్లో వివిధ పంటలను 10,606 మంది రైతులు సాగు చేస్తున్నట్టు తెలిపారు. జాబితాలో పేర్లను రైతులు సరిచూసుకుని అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా వీఏఏ, వీహెచ్ఏ, ఏఓలకు తెలియజేయాలని సూచించారు.